# మర్లవడ్డ కొడంగల్

మొదటిపేజీ తరువాయి...

మొండిపట్టు వీడలేదు. ప్రజాభిప్రాయ సేకరణ.. గ్రామసభ.. అంటూ రైతుల భూముల సేకరణకు చేస్తున్న ప్రయత్నాలకు అధికారులు బలయ్యారు. ఏకంగా కలెక్టర్ సహా అధికారయంత్రాంగంపై దాడి చేసే పరిస్థితి రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ముందుగా రైతులు కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగానాయక్‌పై దాడికి ప్రయత్నించి.. వారి వాహనాలను ధ్వంసం చేశారు. అనంతరం కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డిని చుట్టుముట్టి కొట్టారు. వెంకట్‌రెడ్డిని వెంబడించి కొట్టడంతో ఆయన పొలాల వెంట పరుగులు తీశారు. ఈ ఘటనతో లగచర్ల ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.



ఫార్మా కంపెనీల ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులను వెంబడిస్తున్న లగచర్ల గ్రామస్థులు

### నెలల తరబడి నిరసనలు

ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు గాను దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, రోటిబండతండా, పులిచర్ల కుంట తండాల పరిధిలో 1,375 ఎకరాలు సేకరించాలని సర్కారు నిర్ణయించింది. ఇందులో 600 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉన్నది. మిగిలిన 775 ఎకరాల వరకు రైతుల వద్ద సేకరించాల్సి ఉండగా తమ భూములు ఇచ్చేదిలేదని బాధిత రైతులు నెలల తరబడి దీక్షలు చేస్తూ, నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ సహా అధికారులందరికీ వినతిపత్రాలు కూడా సమర్పించారు. అయినా భూసేకరణ కోసం ప్రభుత్వం కొంతకాలంగా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గత నెల 25న కూడా లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సమావేశానికి హైదరాబాద్ నుంచి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి అనుచరుడు, దుద్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ వాహనాన్ని రోటిబండతండా వద్ద అడ్డుకున్న తండావాసులు అతడిని వాహనం నుంచి దింపి మరీ దాడి చేశారు. ఉరికించి కొట్టడంతో పోలీసులు ఆయనను గదిలో వేసి రక్షణ కల్పించినా తండావాసులు తిరిగి దాడికి తీవ్రస్థాయిలో యత్నించారు. ఈ సంఘటన తర్వాత కూడా రైతులు పలువురు అధికారులను కలిసి ఫార్మా కంపెనీ ఏర్పాటుకు తాము భూములు ఇవ్వబోమని, తమను వదిలేయాలంటూ వినతిపత్రాలు ఇచ్చారు. అయినా ప్రభుత్వం ఒత్తిడి మేరకు అధికారులు మళ్లీ భూసేకరణ ప్రయత్నాలు మొదలుపెట్టారు. సోమవారం దుద్యాల మండలం దుద్యాల–హకీంపేట గ్రామాల మధ్య గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశం లగచర్లకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

### రైతుల కోసం ఎదురుచూసి

గ్రామసభకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయగా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగానాయక్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో పలువురు అధికారులు వికారాబాద్ నుంచి సభ ప్రదేశానికి సుమారు 11.30 గంటలకు చేరుకున్నారు. గత సంఘటనను దృష్టిలో పెట్టుకొని పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు కల్పించారు. కలెక్టర్, అధికారులు అక్కడికి వచ్చేసరికి రైతులెవరూ రాలేదు. వారు ఎందుకు రాలేదని కలెక్టర్ వాకబు చేశారు. ఈ క్రమంలో లగచర్ల నుంచి వచ్చిన ఒక రైతు కలెక్టర్‌తో మాట్లాడాడు. ఫార్మా కంపెనీ ఏర్పాటుపై సమావేశం ఉంటుందని తమ గ్రామంలో ఆదివారం రాత్రి డప్పు వాయించారని, కానీ గ్రామసభ, ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని, కలెక్టర్, ఇతర అధికారులు వస్తారనే సమాచారం మాత్రం తమకు ఇవ్వలేదని చెప్పాడు. రైతులంతా లగచర్లలో ఉన్నారని, వందల మంది రైతులు ఇక్కడికి వచ్చే బదులు పది మంది అధికారులు అక్కడికే వస్తే బాగుంటుందని సదరు రైతు కలెక్టర్‌ను కోరాడు. ఇక్కడైతే సభ, ఏర్పాట్లు ఉన్నాయని.. అక్కడ సౌకర్యాలు ఉండవని కలెక్టర్ చెప్పినా కుర్చీలు ఉంటాయని రైతు సమాధానం చెప్పడంతో చివరకు అక్కడికి వెళ్లేందుకు కలెక్టర్ అంగీకరించారు. ఇతర అధికారులతో కలిసి సుమారు 12 గంటల ప్రాంతంలో లగచర్లకు బయలుదేరారు.

### బెదిరించినందుకే దాడి

**ఆయా** గ్రామాల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు అభ్యంతరం లేదని బొంరాస్‌పేట కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్, నరసింహ, సింగర్ నర్సింహతోపాటు మరోఇద్దరు తీర్మానాలు చేసి పంపగా అప్పట్లోనే వీరిపై గిరిజనులు తిరగబడ్డారు. తమను అడగకుండానే పంపిస్తావా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరికి ఫార్మా కంపెనీకి అడుగులు పడుతున్నాయని తెలిసి ఏకమై తిరుగుబాటు జెండా ఎగరేశారు. దీనికి ప్రధాన కారకుడైన శేఖర్‌పై దాడి చేేందుకు ప్రయత్నించగా గ్రామపంచాయతీలో దాక్కున్నారు. తాజాగా నచ్చజెప్పిందుకు ప్రయత్నించిన కలెక్టర్‌పై గిరిజనులు దాడి చేసినంత పనిచేశారు. గతంలో భూములు ఇవ్వకుంటే లాక్కుంటామని బెదిరించిన కడా స్పెషల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డిని ఉరికించి కొట్టారు. ఈ ఘటన తర్వాత లగచర్ల పూర్తిగా నిర్మానుష్యమైంది. గ్రామంలో కర్ఫ్యూ వాతావరణం కొనసాగుతున్నది. ఇండ్లల్లోంచి ఎవరూ బయటికి రావడం లేదు. చుట్టుపక్కల గ్రామాలన్నీ భయంతో గజగజ వణుకుతున్నాయి.

### ఒక్కసారిగా కోపోద్రిక్తులైన రైతులు

లగచర్లలో టెంటు వేసుకొని నిరసన తెలుపుతున్న రైతుల దగ్గరికి కలెక్టర్, ఇతర అధికారులు సుమారు 12.30 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. ముందుగా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగానాయక్ వాహనం దిగి రైతుల వద్దకు వెళ్లారు. దీంతో ఒక్కసారిగా రైతులు 'కలెక్టర్ గోబ్యాక్' అంటూ నినాదాలు చేస్తూ ముందుకొచ్చారు. కలెక్టర్ వారిని సమాధానపరిచేందుకు ప్రయత్నించినా వారు ఏమాత్రం వినిపించుకోలేదు. ఈలోగా తేరుకున్న కలెక్టరేట్ సిబ్బంది, ఇతర అధికారులు కలెక్టర్ చుట్టూ చేరి ఆయన దగ్గరికి రైతులు రాకుండా నిలువరించే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే గుంపుగా వచ్చిన మహిళలతో సహా రైతులు కలెక్టర్ ఉన్న వైపు రావడం.. తోపులాట చోటుచేసుకోవడంతో ఆయన వెనక్కి వెళ్లారు. ఈలోగా ఓ మహిళా రైతు కలెక్టర్‌పై చేయి చేసుకోవడంతో పరిస్థితిని గుర్తించిన ఆయన వెంటనే తన వాహనం వైపువెళ్లారు. అప్పటికే చుట్టుముట్టిన రైతులు ఆయనను నిలువరించే ప్రయత్నం చేశారు. అదనపు కలెక్టర్ లింగానాయక్‌ను ఓ రైతు గొంతు పట్టి దాడి చేసేందుకు ప్రయత్నించాడు. అక్కడ పెద్ద ఎత్తున గలాటా జరుగుతుండటంతో కలెక్టర్ తన వాహనం వద్దకు చేరుకొని, లోపల కూర్చున్నారు. అయినప్పటికీ రైతులు వాహనాన్ని చుట్టుముట్టి రాళ్లు, కర్రలతో వాహనంపై దాడి చేశారు. వాహనం వెనక అద్దాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. కలెక్టర్ కూర్చున్న తర్వాత కూడా రాళ్లతో ముందటి అద్దాన్ని ధ్వంసం చేశారు. దీంతో డ్రైవర్ వేగంగా వాహనాన్ని ముందుకుపోనిచ్చి వికారాబాద్ వెళ్లిపోయారు.

### అధికారి హెచ్చరికలతో ఏకమైన గిరిజనులు!

ఫార్మా కంపెనీకి తమ భూములు ఇచ్చేందుకు గిరిజనులు ఏ మాత్రం అంగీకరించడం లేదు. 'భూములు ఇవ్వకుంటే గుంజుకుంటాం' అంటూ కడా అధికారి చేసిన హెచ్చరికలే గిరిజనులను ఏకం చేసినట్టు తెలుస్తున్నది. వారు తమ ప్రాణం పోయినా భూములు ఇచ్చేది లేదని తెగేసి చెప్తున్నారు. వారం కిందట ఓ కాంగ్రెస్ నేతను కారులోంచి దింపి మరీ కొట్టిన సంగతి తెలిసిందే..

### కలెక్టర్ వెళ్లిపోయినా.. చల్లారని కోపం

వాహనంలో కలెక్టర్ వెళ్లిపోయిన తర్వాత కూడా లగచర్ల రణరంగాన్ని తలపించింది. పెద్ద సంఖ్యలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులు, ఇతర అధికారులపై దాడికి దిగారు. ముఖ్యంగా కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో పాటు డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డిపైనా దాడి చేశారు. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని చుట్టుముట్టి తీవ్రస్థాయిలో పిడిగుద్దులు గుద్దడంతో ఆయన భయంతో పరుగులు తీశారు. అయినా వెనక్కితగ్గకుండా వెంబడించి మరీ కొట్టారు. ఈ క్రమంలో వెంకట్‌రెడ్డి అంగీ చినిగిపోయింది. భయంతో ఆయన పొలాల్లో పరుగులు తీశారు. రైతులు వెంటపడటంతో పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని రైతులను చెదరగొట్టారు. అనంతరం తమ రక్షణ మధ్య పోలీసులు వెంకట్‌రెడ్డిని అక్కడికి నుంచి వాహనంలో తరలించారు. మరోవైపు ఇతర రైతులు కూడా పలువురు అధికారుల వెంటపడటంతో వారు భయంతో పోలీసు వాహనాలు ఎక్కి తమను తాము కాపాడుకున్నారు. ఇలా దాదాపు అరగంట పాటు లగచర్ల రణరంగాన్ని తలపించింది.


### అక్కడ కాదని ఇక్కడ ఎందుకు?

ఫార్మాసిటీ కోసం కేసీఆర్ హయాంలో సుమారు 14 వేల ఎకరాలు గుర్తించారు. కాంగ్రెస్ రాగానే ఫార్మాసిటీ ఏర్పాట్లను రద్దుచేసి సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గంలో పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు దుద్యాల మండలాన్ని ఎంచుకున్నారు. మూడు వేల ఎకరాలు సేకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఇక తమ బతుకులు బాగుపడతాయనుకున్న స్థానిక రైతులు, గిరిజనులకు ఇది మింగుడుపడలేదు. దుద్యాల మండలంలోని ఆరు గ్రామాల్లో ఉన్న రైతులంతా గిరిజనులే (లంబాడాలు) కాగా, సేద్యం చేసుకొని బతికే వీరికి ఫార్మాసిటీ శాపంగా మారింది. ఈ గ్రామాల పరిధిలో ఎకరాకు రూ.60 లక్షల దాకా ధర పలుకుతున్నది. కానీ ప్రభుత్వం మాత్రం రూ.10 లక్షలు ఇస్తాం.. ఫార్మా కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇస్తున్నది. భూములన్నీ పోగొట్టుకొని చిన్నాచితకా ఉద్యోగాల కోసం వెంపర్లాడడం అవసరమా? అంటూ గిరిజనులంతా ఏకమయ్యారు. పచ్చని పల్లెల్లో కాలుష్యం వెదజల్లే ఫార్మా కంపెనీలు పెట్టొద్దంటూ ఆందోళనలు చేపడుతున్నారు. అన్ని గ్రామాలకు సమీపంలో టెంట్ వేసి మరీ నిరాహార దీక్షలకు దిగారు.

### 8 నెలలుగా తిండి లేదు, నిద్ర లేదు : ఫార్మా రైతుల ఆవేదన

**ఫార్మా** కంపెనీ ఏర్పాటును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా పదేపదే ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామ సభ అంటూ అధికారులు విసిగిస్తున్నారని ఫార్మా బాధిత రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. తాము భూములు ఇచ్చేది లేదని చెప్పినా ప్రభుత్వం మొండి వైఖరి వీడటంలేదని చెప్పారు. ఎనిమిది నెలలుగా రోజూ ఇదే వరుస కొనసాగుతున్నదని, భూములను కాపాడుకునేందుకు తిండి, నిద్ర లేకుండా గడుపుతున్నామని వాపోయారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకో లేదని తెలిపారు. గత నెలలోనే రోటిబండ తండాలో పెద్ద ఎత్తున రగడ కొనసాగిందని, కొన్ని రోజులు సద్దుమణిగాక ఇప్పుడు సమావేశం అంటూ మళ్లీ ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. అందుకే తాము విగిసిపోయి అధికారులపై తిరుగబాటు చేయాల్సి వచ్చిందని పలువురు రైతులు చెప్పారు. కోట్లాది రూపాయల విలువైన భూములను ప్రభుత్వానికి అప్పజెప్పి తాము, తమ పిల్లలు ఎలా బతకాలని, తమ జీవనాధారం పోతే ఏం చేసుకొని జీవించాలని ప్రశ్నించారు.

## లోకం పోకడ




ఇక్కడైతే పాదయాత్ర కాదు.. జనం తరిమికొడితే పరుగుల యాత్ర అవుతుందని భయపడి..!

## దాడి అనడం సరికాదు!

'దాడి' అని మీడియా రాయొద్దు

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ):వికారాబాద్‌లో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు భూసేకరణ కోసం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ ఉద్రిక్తతకు దారి తీసింది. రైతులు అధికారులపైకి తిరగబడ్డారు. తమ భూములు ఇచ్చేది లేదంటూ అక్కడ్నుంచి అధికారులను తరిమేశారు. అయితే ఈ ఘటనపై వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పందించారు. ఆయన మాట్లాడుతూ 'వాళ్లంతా మా రైతులు. వాళ్లు మాపై దాడి చేయలేదు. అది దాడి కానేకాదు. వాళ్లే మమ్మల్ని మాట్లాడటానికి పిలిచి తీసుకొని పోయారు. అయితే అక్కడ కొందరు ఉన్నారు. వాళ్లంతా కుట్ర చేయడం ప్రారంభించారు. వాళ్లంతా ట్రైబల్స్. మేం దాడి అని అనుకోవడం లేదు. మీడియా కూడా దాడి అని రాయొద్దు' అని చెప్పారు.

## ఘటనకు రేవంత్‌దే పూర్తి బాధ్యత

మాజీ ఎమ్మెల్యే ఆనంద్



వికారాబాద్, నవంబర్ 11 : సీఎం సొంత నియోజకవర్గంలోనే అధికారులు అడుగుపెట్టలేని దుస్థితి నెలకొన్నదని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ప్రకటనలో పేర్కొన్నారు. లగచర్లలో కలెక్టర్‌పై దాడి జరగటం దురదృష్టకరమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. దుద్యాలలో 1,350 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి ఫార్మా కంపెనీకి ఇవ్వాలని నిర్ణయించిందని, ఇక్కడి రైతుల నుంచి పట్టాభూములు సేకరించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని వివరించారు. రైతులు తమ ప్రాణం లాంటి భూములను ఔషధ కంపెనీకి ఇచ్చేది లేదని తెగేసి చెప్తున్నా పట్టింపులేని కాంగ్రెస్ ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేస్తూ వారి ని తీవ్ర మనోవేదనకు గురిచేసిందని, అందులకే వారు తిరగబడ్డారని పేర్కొన్నారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డి వహించాలని డిమాండ్ చేశారు.

## లంబాడీలను వేధిస్తున్న సర్కార్

భూములను లాక్కునే యత్నం

ఫార్మా కంపెనీలకు కట్టబెట్టేందుకు కుట్ర

సీఎం సొంత ఇలాకాలో వేధింపులు

లంబాడీ హక్కుల పోరాట సమితి నేత రాంబల్‌నాయక్

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు లంబాడీలను వేధిస్తున్నదని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఫార్మా కంపెనీల పేరుతో సీఎం సొంత నియోజకవర్గంలోని రైతులు, ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. లంబాడీల భూములను అక్రమంగా లాక్కోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలోని రోటిబండ తండా పంచాయతీ పరిధిలోని ఐదు తండాలు, లగచర్ల, పీర్లపల్లి, తదితర గ్రామాల ప్రజల భూములను ఫార్మా కంపెనీలకు కట్టబెట్టాలని అధికారులు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. సమాచారం లేకుండా సోమవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తహసీల్దార్, 500 మంది పోలీసులతో తండాలపై దాడులు చేశారని ఆరోపించారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో గిరిజనులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూక్యా సంజీవనాయక్

## గిరిజనులపై దాడులు హేయం

సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్

చిక్కడపల్లి, నవంబర్ 11: కొడంగల్ మండలం రోటి బండా తండాపై ప్రభుత్వం చేసిన దాడులను సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్ తీవ్రంగా ఖండించారు. మూసీ పునర్జీవానికి ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల్లో ఒక్కరూపాయి వాడినా సహించబోమని హెచ్చరించారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 వేల ఎకరాల లంబాడీల భూములను లాక్కొని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. అందులు భాగంగానే గిరిజనులపై దాడులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల ఓట్లతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డికి వారిని మోసం చేయడానికి మనసెలా వచ్చిందని ప్రశ్నించారు.

## సీఎం మూర్ఖత్వం వల్లే ఈ దారుణం

తుగ్లక్ ఆలోచనతోనే అలజడి • మీ మోసాలకు అధికారులు బలిపశువులా?

అధికారులకు దెబ్బలు దురదృష్టకరం • బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): 'ఇది ప్రజాపాలన కాదు.. ప్రజలు తిరగబడుతున్న పాలన.. ఏడాదిలోనే ఎదురీదుతున్న పాలన' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 'ఆంక్షలు పెట్టి..ప్రజాకాంక్షలను తొక్కేస్తామంటే తెలంగాణ నేల ఊరుకోదు.. తిరగబడుతుంది.. తరిమికొడుతుంది.. తస్మాత్ జాగ్రత్త!' అని హెచ్చరించారు. ఫార్మా రైతులకు న్యాయం చేస్తామని కబుర్లు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి సెక్యూరిటీ లేకుండా తన సొంత మండలం దుద్యాలకు వచ్చే దమ్ముందా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మోసాలకు అధికారులు ఎందుకు బలి పశువులను చేస్తున్నారని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూర్ఖత్వం వల్లే అధికారులు దెబ్బలు తినాల్సి రావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో పరిపాలన, శాంతి భద్రతల వైఫల్యానికి తాజా ఉదాహరణే రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఏకంగా జిల్లా కలెక్టర్‌పైకి రైతుల తిరుగుబాటు అని తెలిపారు. రేవంత్‌రెడ్డి దురాశ, అవగాహనా రాహిత్యం వల్లే ఈ దుస్థితి దాపురించిందని చెప్పారు. భూసేకరణ పూర్తయి, అన్ని అనుమతులు వచ్చి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఫార్మాసిటీని రద్దు చేసి, రాష్ట్రంలో పది చోట్ల ఫార్మా క్లస్టర్లు పెట్టాలనే రేవంత్‌రెడ్డి తుగ్లక్ ఆలోచనే ఈ అలజడికి కారణమని విశ్లేషించారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను అమ్ముకొని సొమ్ముచేసుకుందామనుకున్న రేవంత్ కుత్సిత బుద్ధితో ఇప్పుడు ఫార్మాసిటీ భవితవ్యం ప్రమాదంలో పడిందని, కొడంగల్‌లో అన్నదాతల భూములు గుంజుకునే కుట్ర మొదలైందని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నదని, అనేకచోట్ల ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నదని, అదికాస్తా కాంగ్రెస్ అసమర్థ ప్రభుత్వాన్ని త్వరలోనే భూస్థాపితం చేస్తుందని పేర్కొన్నారు.

## పచ్చటి పొలాల్లో రేవంత్ చిచ్చు

కిసాన్ హటావో చర్యల వల్లే గొడవ • పిచ్చోడి చేతిలో రాయిలా పాలన

రేవంత్‌రెడ్డి మీది కోపాన్ని ప్రజలు అధికారులపై చూపిస్తున్నరు: హరీశ్



**గరీబీ** హటావో అని ఇందిరాగాంధీ పిలుపునిస్తే ఫార్మాసిటీ పేరుతో పచ్చని పంట పొలాల నుంచి కిసాన్ హటావో అని పిలుపునిస్తున్న రేవంత్‌రెడ్డి చర్యలే వికారాబాద్ ఘటనకు కారణమని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ పాలనకు ఐఏఎస్‌లు, ప్రభుత్వ అధికారులు ప్రజాగ్రహానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఫార్మాసిటీ కోసం కేసీఆర్ హైదరాబాద్‌కు దగ్గరగా కాలుష్యం లేకుండా, జీరో వ్యర్థాలతో 15 వేల ఎకరాలు సేకరించి సిద్ధం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పర్యావరణం, అటవీ సహా అన్ని రకాల అనుమతులు వచ్చిన దాన్ని పక్కనపెట్టి పచ్చటి పొలాల్లో రేవంత్‌రెడ్డి ఫార్మా చిచ్చు పెడుతున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి మీద ఉన్న కోపాన్ని కొడంగల్ ప్రజలు ఆ జిల్లా కలెక్టర్, ప్రభుత్వ అధికారుల మీద చూపుతున్నారని, అంతేతప్ప అధికారులంటే ప్రజలకు కోపం ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు.

## సీఎం అనాలోచిత నిర్ణయాల వల్లే దాడులు

• మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



వికారాబాద్, నవంబర్ 11 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల అధికారులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్న తల్లి లాంటి ఊరును, భూమిని కోల్పోతున్నామనే బాధ, ఆవేదన, ఆక్రోశం ప్రజల్లో ఉండటం సహజమని, వారి వైపు నుంచి కూడా ప్రభుత్వం ఆలోచించి న్యాయం చేయాలని సూచించారు. అతి తక్కువ కాలంలోనే అత్యంత ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి రికార్డు సాధించారని ఎద్దేవాచేశారు. ఫార్మా కోసం కేసీఆర్ 15 వేల ఎకరాలు సేకరించి సిద్ధంగా ఉంచారని గుర్తుచేశారు. కావాలనే అనేక చోట్ల ఫార్మా కంపెనీలు అంటూ ముఖ్యమంత్రి హంగామా చేస్తున్నారని విమర్శించారు. ఏదైనా ప్రజలను ఒప్పించాలి గాని, ప్రభుత్వ నిర్ణయాన్ని బలవంతంగా ప్రజలపై రుద్దే ప్రయత్నం చేయవద్దని హితవుపలికారు. ఇప్పటికైనా ప్రజల కోరిక మేరకు ప్రభుత్వం ఈ క్లస్టర్ల ఏర్పాటుపై పునరాలోచించాలని సూచించారు.

# రైతులు తిరగబడితే.. బీఆర్ఎస్‌పై నిందలా!

- కొడంగల్ ఘటనను బీఆర్ఎస్‌కు అంటగడుతూ కాంగ్రెస్ సోషల్ మీడియాలో దుష్ప్రచారం
- స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా వికారాబాద్ కలెక్టర్ ఎందుకెళ్లారు?
- స్థానిక పరిస్థితులపై అధికారులు గ్రౌండ్‌రిపోర్ట్ తీసుకున్నారా?
- ప్రభుత్వ తీరుపై రాజకీయ విశ్లేషకులు, బీఆర్ఎస్ నేతల మండిపాటు



అధికారులను అడ్డుకునేందుకు వెళ్తున్న లగచర్ల వాసులు

హైదరాబాద్, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): ఫార్మా క్లస్టర్ ఏర్పాటుతో తమ భూములు పోతాయని కడుపుమండిన రైతులు అధికారులపై తిరగబడితే దానిని తమ పార్టీకి అంటగడుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీ ఏర్పాటుపై వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఇతర అధికారులతో కలిసి ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లగా, వారిపై రైతులు ఒక్కసారిగా తిరగబడ్డారు. అయితే, బీఆర్ఎస్ నేతలే అధికారులపై దాడి చేసినట్టుగా కాంగ్రెస్ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. పలువురు కాంగ్రెస్ నేతలు సైతం ఈ ఘటనను బీఆర్ఎస్‌కు చుట్టేందుకు ప్రయత్నించడాన్ని రాజకీయ విశ్లేషకులు సైతం తప్పుపడుతున్నారు. 'రైతుల సమస్యలను పరిష్కరించకుండా రాజకీయం చేయడమేమిటి? ఉద్రిక్త పరిస్థితుల్లో అక్కడికి కలెక్టర్ వెళ్లాల్సిన అవసరం ఏమిటి? క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో ఎందుకు అంచనా వేసుకోలేదు' అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యంపై పలు ప్రశ్నలు సంధిస్తున్నారు.

### కలెక్టర్ ఎందుకు వెళ్లాల్సి వచ్చింది?

కొడంగల్ నియోజకవర్గంలో ప్రభుత్వం ఫార్మా క్లస్టర్ ఏర్పాటు కోసం భూసేకరణ ప్రారంభించింది. అక్కడ కొంతకాలంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవలే అక్కడికి వెళ్లిన ఒక అధికారిని రైతులు నిర్బంధించారు. అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ప్రభుత్వానికి, కలెక్టర్‌కు తెలుసు. అయినప్పటికీ కలెక్టర్ అక్కడికి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందనేది రాజకీయ విశ్లేషకుల ప్రశ్న. ఒకవేళ ప్రజాభిప్రాయ సేకరణ కోసం తప్పని పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే అక్కడ పరిస్థితి ఏ విధంగా ఉన్నదో అనే అంశంపై కలెక్టర్ ఎందుకు ఆరా తీయలేదనేది మరో ప్రశ్న.

### పరిస్థితులను ఎందుకు చక్కదిద్దలేదు?

ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ప్రాంతానికి కలెక్టర్ వస్తుంటే, స్థానిక యంత్రాంగం అంతకుముందే అక్కడ పరిస్థితులను పూర్తిగా అదుపులోకి తీసుకోవాలి. గ్రౌండ్‌ప్రిపేర్ చేయాలి. కలెక్టర్ రావడానికన్నా ముందే రైతులతో మాట్లాడి, ప్రశాంత వాతావరణంలో కలెక్టర్‌తో చర్చలు జరిపేలా రైతులను ఒప్పించాలి. ఇలాంటి చర్యలు తీసుకోవడంలో స్థానిక రెవెన్యూ యంత్రాంగం విఫలమైంది.

### పరిస్థితి తెలిసీ కలెక్టర్ వెళ్లారా?

ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించి కలెక్టర్ ప్రతీక్‌జైన్ కూడా సరిగ్గా వ్యవహరించలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ప్రాంతానికి వెళ్తున్నప్పుడు అక్కడ ఎలాంటి పరిస్థితులు ఉన్నాయనే అంశంపై ఆయన పోలీస్ శాఖను రిపోర్ట్ కోరాలి కదా? అని ప్రశ్నిస్తున్నారు. ఆయన పోలీస్ రిపోర్ట్ ఎందుకు కోరలేదు? ఒకవేళ కోరితే అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని తెలిసి కూడా ఎందుకు వెళ్లారు? అని ప్రశ్నిస్తున్నారు.

### ఇంటెలిజెన్స్, పోలీస్ శాఖ వైఫల్యం కాదా?

ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ప్రాంతానికి కలెక్టర్ వస్తున్నారంటే అక్కడి పరిస్థితులపై ఇంటెలిజెన్స్, పోలీస్ శాఖ ముందుగా సమాచారం సేకరించాల్సిన అవసరం లేదా? అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, అక్కడికి రావొద్దని కలెక్టర్‌కు ముందే ఎందుకు సూచించలేదు? ఒక కలెక్టర్‌పై రైతులు తిరగబడే పరిస్థితి వచ్చే వరకు ఇంటెలిజెన్స్, పోలీస్ శాఖ ఏం చేస్తున్న? ఇది ఇంటెలిజెన్స్, పోలీస్ శాఖ వైఫల్యం కాదా? అని విశ్లేషకులు ప్రశ్నలు సంధిస్తున్నారు.

### రావొద్దని ముందే హెచ్చరించిన రైతులు

అభిప్రాయ సేకరణకు కలెక్టర్ వస్తున్నారని రైతులకు అధికారులు సమాచారం అందజేశారు. భూసేకరణను వ్యతిరేకిస్తున్న రైతులు ఇక్కడికి ఎవరూ రావొద్దని ముందే హెచ్చరించారు. ఫార్మా క్లస్టర్ కోసం గజం భూమినీ ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. రైతుల హెచ్చరికలను, అల్టిమేటమ్‌ను పట్టించుకోకుండా కలెక్టర్, అధికారులు అక్కడికి భూసేకరణకు కోసం వెళ్లారు. అప్పటికే ప్రభుత్వంపై పీకల్లోతు కోపంతో ఉన్న రైతులకు అధికారులను చూడగానే పుండు మీద కారం చల్లినట్టయ్యింది. భూమిని రక్షించుకోవాలనే ఆలోచనతో వచ్చింది కలెక్టర్ అని చూడకుండా తిరగబడినట్టు స్పష్టమవుతున్నది.

### రైతులను రెచ్చగొట్టిన రేవంత్ అనుచరులు

భూములు ఇచ్చేది లేదని రైతులు భీష్మించుకూర్చున్నారు. రైతులకు నచ్చజెప్పాల్సిన ప్రభుత్వం వారిపైకి తమ అనుచరులను వదిలినట్టు తెలిసింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి అనుచరులు కొంతమంది రైతులపై బెదిరింపులకు దిగినట్టు తెలిసింది. 'మీరు భూములు ఎట్లా ఇవ్వరో చూస్తాం. ఏం చేసైనా సరే భూములు తీసుకోవడం ఖాయం' అంటూ హెచ్చరించినట్టు తెలిసింది. దీంతో రైతుల్లో మరింత ఆగ్రహం పెరిగింది. 'మా ప్రాణాలు పోయి నా సరే భూమిని ఇచ్చేది లేదు' అంటూ రైతులు మొండికేసినట్టు తెలిసింది. రైతులను రెచ్చగొట్టడం, బెదిరించడంతోపాటు ఉద్రిక్త పరిస్థితులున్న సమయంలో కలెక్టర్, అధికారులు అక్కడికి వెళ్లారు. ఇన్ని తప్పులు ప్రభుత్వం వైపు పెట్టుకొని రైతులు తిరగబడితే దానిని బీఆర్ఎస్‌కు అంటగట్టే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం.

### బీఆర్ఎస్‌కు ఏం సంబంధం?

**కాంగ్రెస్** ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ ఎప్పటికప్పుడు ఎండగడుతున్నది. రైతుల పక్షాన పోరాడుతున్నది. అయితే ఇది ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. తమ పార్టీని బద్నాం చేయాలనే కుట్రపూరిత ఆలోచనలకు కాంగ్రెస్ తెరతీసిందని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇందులో భాగంగానే కొడంగల్‌లో ఫార్మా క్లస్టర్ భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు అధికారులపై తిరగబడితే ఈ ఘటనను బీఆర్ఎస్‌కు ఆపాదించే ప్రయత్నం చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రైతులు తిరగబడితే బీఆర్ఎస్‌కు ఏం సంబంధం అనే ప్రశ్న ఎదురవుతున్నది? ఇది ముమ్మాటికీ బట్ట కాల్చి మీదేసే విధానమే తప్ప మరొకటి కాదని విశ్లేషకులు చెప్తున్నారు.